భూపాల్

# కొంచెపు గుణం

**ప్రమోద్, రామారావు ఇంటికెళ్ళేసరికి రామారావు ఒక్కడే వున్నాడు. ప్రమోద్‌ని చూసి రామారావు సంతోషంతో "చాలా రోజులైంది ప్రమోద్ నిన్ను చూసి నీవు రావడం చాలా సంతోషం! రా కూర్చో"! అన్నాడు ప్రేమగా.**

ఇంట్లో వుండే సమయాల్లో రామారావు లుంగీ గుడ్డ చుట్టుకొని, బనియన్ వేసుకొనే వుంటాడు. ఇప్పుడూ అలాగే ఉన్నాడు. ఏదో పుస్తకం చేతిలో వుంది. ప్రమోద్ కూర్చోగానే కాలింగ్ బెల్ మోగింది. రామారావు వెళ్ళి తలుపు తీశాడు. అతను లోపలికి వచ్చి ప్రమోద్ కళ్ళముందే ఆరువేలు లెక్కించి ఇచ్చి మళ్ళీ కలుస్తానండి అంటూ రామారావు ఇచ్చిన రిసీవ్డ్ రిసిప్ట్ తీసుకొని వెళ్ళిపోయాడు.



ఇల్లు పెద్దదే ఐనా ఈ మధ్యే కొత్తగా కట్టుకుంది. వృథా ఖర్చు ఎందుకని అలమారాలు కొనలేదు. ఆ డబ్బు ఎక్కడ దాచాలో అర్థం కాకుంది. టైం చూస్తే మూడు గంటలు దాటింది. బ్యాంకులు ఉండవు. డబ్బు పట్టుకొని ఆ గదికీ, ఈగదికీ తిరుగుతున్నాడు. గానీ, ఎక్కడా పెట్టకున్నాడు. వచ్చిన మిత్రునితో మాట్లాడాలాయె! డబ్బు చేతిలో పట్టుకొనే కాస్సేపు మాట్లాడి మళ్ళీ లేచివెళ్ళి వంట గదిలో ఏదో డబ్బాలో వుంచి వచ్చాడు.

అతని ప్రవర్తన తీరు చూసి ప్రమోద్‌కి ఆశ్చర్యమేసింది. ఆ డబ్బు ఎక్కడైనా అలా పెట్టేయవచ్చుగదా! ఉన్నది ఇద్దరమే గదా! ఎందుకింత హైరానా? అనుకున్నాడు మనస్సులో.

"మా కాలనీలో దొంగల భయముందండీ. మొన్న కేశవరావు ఇంట్లో నుండి పట్టపగలే ట్రాన్సిస్టర్ ఎత్తుకెళ్ళారు" అన్నాడు రామా రావు.

"అందుకా మీరింత బెంబేలు పడుతున్నారు. ఇప్పుడెవరొస్తారండీ నేనున్నాగా! ఇంకా ఓ గంట అయితే మీ పిల్లలూ, భార్య వస్తారు" అన్నాడు ప్రమోద్.

రామారావుని చూస్తే డబ్బున్నవాడని ఎవరూ అనరు. చాలా సింపుల్‌గా దుస్తులేస్తాడు. చాలా జాగ్రత్తగా ఖర్చు పెడతాడు. నలుగురు స్నేహితుల్లా పట్టున పది రూపాయలు ఖర్చు చేయగా ప్రమోద్ ఎప్పుడూ చూడలేదు. పోనీ జేబులో నుండి నాల్గు వందలు తీసి ఒక్కడుగా తన కోసమే వస్తువులు కొన్నవీ చూడలేదు. ప్రతి వంద రూపాయలు బ్యాంకులోనే వుంటాయి. మరి ఆస్తుపాస్తులు లేవా అంటే అదేం కాదు. ఈ క్షణం లెక్కేసినా యాభై లక్షలకు తక్కువలేని ప్లాట్లూ, ఇల్లూ వున్నాయి. ఐనా వ్యక్తిగా మంచివాడనీ, ఎవరికీ అపకారం చేయడని ప్రమోద్ నమ్మకం.

ఆరువేలు చేతికందినాక రామారావు చెంచలత్వం వింతగా తోచి చూస్తున్నాడు. అదో డ్రామా సీన్‌గా వుంది తనకి.

ఇంతలో రామారావుకి బాత్‌రూం అవసరమొచ్చింది. అటు బాత్ రూంకి వెళ్లేవాడు వంట గదికెళ్ళి లుంగీ, పంచ సర్దుకుంటూ పైకి కట్టుకుని వెళ్ళడంతో డబ్బు తనతో తీసుకెళుతున్నాడని అర్థమైంది. వెంటనే విపరీతమైన బాధకు గురయ్యాడు ప్రమోద్. రామారావు తనను ఇంత నీచంగా లెక్కిస్తున్నాడా? ఛీ వీడూ స్నేహితుడేనా? ఇదేం మనస్తత్వం అనుకున్నాడు. పోనీ నా చరిత్ర తప్పుడు తడకలతో వుందా? నేనెవర్నర్నా మోసం చేశానా? ప్రమోద్ రకరకాలుగా ఆలోచింపసాగాడు.

బాత్‌రూం నుంచి తిరిగొచ్చిన రామారావు మళ్ళీ వంట గదికి వెళ్ళి వస్తూ "రఘునాథరావుకి సాయంత్రం డబ్బిస్తానని చెప్పాను" అన్నాడు.

"ఓహో...! అలాగా!" అని ఊరికే ఎటో వెళుతూ ఉంటే ఉన్నారా అని ఇటుగా వచ్చానంతే మళ్ళీ కలుద్దాం వెళుతున్నానని ప్రమోద్ వెళ్ళిపోయాడు.



ఆ తర్వాత సరిగ్గా మూడు రోజులనాడు ఆదివారం ప్రమోద్‌కి రామారావు ఫోన్ చేసి ఫలానా చోట లక్ష్మాగౌడ్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ వుంది వెళదామా అని అడిగాడు. ప్రమోద్ పది గంటల వరకు ఇంటికి రమ్మన్నాడు. రామారావు వచ్చాడు.

ఇద్దరూ బయలు దేరారు. ప్రమోద్ చేతిలో ఏదో బ్యాగ్ వుంది. ఎగ్జిబిషన్ కెళుతూ మధ్యలో మరో మిత్రుని ఇంటి దగ్గర కాస్సేపు ఆగారు. అక్కడే కలిశాడు యశ్వంత్‌రావు. ప్రమోద్‌కి చాలా దగ్గర మిత్రుడు. తనతో ఉన్న ఫళంగా ఎక్కడికో రావాలని పట్టుపట్టాడు. ఇక చేసేది లేక ప్రమోద్ "రామారావు హాస్పిటల్ పని చాలా సీరియస్ వ్యవహారం. పెయింటింగ్ ప్రదర్శన రేపు చూస్తాం మేం. వీలైతే నీవు వెళ్ళు. ఇదిగో ఈ బ్యాగ్ నీ దగ్గరుండనీ, సాయంత్రంలోగా లేకుంటే రేపు ఉదయం తీసుకుంటాను. ఇందులో నలభై వేల రూపాయలున్నాయి" అని నాలుగు వందేసి రూపాయల కట్టలు చూపించి తొందర తొందరగా వెళ్ళిపోతూ "ఇంట్లో ఇవ్వకు, నా భార్య కూడా లేదు" అన్నాడు.

మరోమాట మాట్లాడే అవకాశం కూడా రామారావుకి దొరకలేదు.

మరునాడు మధ్యాహ్నం ప్రమోద్ రామారావు ఇంటికెళ్ళాడు. క్రితంలాగా హైరానాలో వున్నాడు. ప్రమోద్‌ని చూడగానే "నలభై వేలు అలా ఇచ్చి వెళితే నేనేం కావాలనుకున్నావు? ఐనా ఇంత డబ్బు నమ్మి... ఇలా" అన్నాడు.

"రామారావు! ఇప్పుడు నీవేమయ్యావు? ఏమీ కాలేదు. నమ్మకమంటావా? పది రూపాయలు మనిషి పశువును చేస్తాయని నీవు అనుకుంటావు. పది లక్షలైనా వ్యక్తిత్వం ఉన్నవాళ్ళను పిసరంత కదల్చలేవని నేను నమ్ముతాను. పైసే ప్రధానం కాదు. మనిషి మనస్తత్వం ముఖ్యం. నీవు మంచివాడివి. ఎవరికీ హాని చేసివుండవు, చేయలేవు" అన్నాడు.

వెళ్తూ వెళ్తూ "ఇంకా నీవు డబ్బు విషయంలో ఇంత పిచ్చిగా ప్రవర్తిస్తే నీ అతి సన్నిహితుల్ని పోగొట్టుకుంటావు. దూరం చేసుకుంటావు. మొన్న నేను నీ ప్రవర్తనతో చాలా బాధపడ్డాను" అని చెప్పి డబ్బు తీసుకొని వెళ్ళిపోయాడు.